

# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

" కిరణ్ వాళ్ళని రేపు పిలిచి మాట్లాడి  చెప్పవచ్చు కదా?"

స్నేహ చెప్పినంత తేలిగ్గా చెప్పలేకపోయాడు డా. రాజేష్.

ఒక డాక్టర్ గా ఎంతో మందిని ట్రీట్ చేస్తాడు తను.

దాదాపుగా అందరినీ గుర్తు పెట్టుకుంటాడు. అందరిలోనూ , మనసుకి దగ్గరగా వచ్చినవాళ్ళు కొందరు మాత్రమే ప్రత్యేకంగా ఉంటారు. అందరిలాగే తనకీను.

ఆడపిల్లలు లేకపోవడం వల్లనో, మరే కారణం వల్లనో స్వప్నిక తన మనసుకెంతో దగ్గరగా వచ్చిన పిల్ల.

"డాక్టర్ అంకుల్" అంటూ ఎంతో చనువుగా కబుర్లు చెప్తూ ఉంటుంది. ప్రతీసారీ ఫలానా కప్పు నెగ్గాననో, ఏదైనా పోటీలో గెలిచాననడం చెప్తూ ఉత్సాహంగా కబుర్లు చెప్తుంది.

మరొక రోజు ఆయన తన ఆలోచనల్లోనే గడిపి, విషయాలని బేరీజు వేసుకున్నాడు. అదృష్టవశాత్తు ఆరోజు ఆయన క్లినిక్ లో ఎక్కువమంది పేషెంట్లు లేకపోవడం కూడా కలిసి వచ్చింది.

ఆ తర్వాత రోజు పొద్దున్నే కిరణ్ ని రాధిక ని రమ్మని ఫోన్ చేసి పిలిచాడు.

" మళ్ళీ రమ్మన్నారా? అర్జంట్ అన్నారా? ఏదైనా చెప్పారా?" రాధిక ఆత్రుతగా అడిగింది కిరణ్ ని.

" ఏమీ చెప్పలేదు రాధీ, కానీ ఎందుకో రాజేష్ కొంచం అన్యమనస్కంగా ఉన్నట్టు అనిపించారు" అన్నాడు కిరణ్.

భయంగా చూసింది భర్తవైపు.

" చూద్దాం, ఏమంటారో?" అన్నాడు కిరణ్.

పిల్లలిద్దరినీ ఇంట్లోనే జాగ్రత్తగా ఉండమని చెప్పి, ఇద్దరూ వెంటనే బయలుదేరారు కిరణ్ బైక్ మీద.

" ఆ కిరణ్ గారు, రాండి, డాక్టర్ మీ కోసమే చూస్తున్నారు" వెళ్తూనే చెప్పింది దుర్గ.

పరుగులాంటి నడకతో ఇద్దరూ లోపలకి వెళ్ళారు.

"రండి, రండి" అంటూ లేచి ఎదురువచ్చాడు రాజేష్.

" డాక్టర్!" అంటూ ముందుకు నడిచింది మొదట రాధిక.

" కూర్చోండి" అన్నాడు తను కూడా కూర్చుంటూ.

" పరవాలేదు, ముందు విషయమేమిటో చెప్పండి ప్లీజ్" అంది రాధిక ఆదుర్దాతో.

" య, అదే, నిన్ననే మనం స్వప్ని బ్లడ్ టెస్ట్ రిపోర్ట్ గురించి చెప్పుకున్నాం కదా! దానిగురించే" అన్నాడు.

" అవును చెప్పారు కదా, మళ్ళీ బ్లడ్ టెస్ట్ చేయిద్దామని" అన్నాడు కిరణ్.

" ఆ, యా, చెప్పాను. ఆమె బ్లడ్ రిపోర్ట్ లో ఉన్న విషయాలకి కారణం ఏమిటో తెలుసుకోవడం చాలా ముఖ్యం అని. ఆమె రక్తం లో లెక్కకు మించి ఎక్కువగా ఉన్న తెల్ల రక్త కణాల గురించే ఆలోచించాలి అది కేవలం రక్తహీనత అంటే ఎనిమిక్ గా ఉండి ఉండడం వల్ల కావచ్చు, లేదా మరేదైనా కారణం కావచ్చు అని చెప్పాను కదా.

" అవును డాక్టర్ చెప్పారు" అన్నాడు కిరణ్

కారణం ఇదీ అని తెలుసుకుంటే మనం తనకి సరి అయిన ట్రీట్మెంట్ ఇవ్వడానికి బావుంటుంది. అసలు కారణం తెలుసుకోవడానికి, మరొక టెస్ట్ చేయిసే బావుంటుంది అని మేము అనుకున్నాం" అంటున్న అతన్ని మధ్యలోనే ఆపి

" మరొక టెస్టా? ఏం టెస్ట్ డాక్టర్?

మేము అంటున్నారు, మేము అంటే మీరు, డా.స్నేహానా?" అంది రాధిక

" కాదమ్మా, నేను, నేను,  డాక్టర్ సుజిత్" అన్నాడు రాజేష్.

సూది పడితే వినిపించేంత నిశ్శబ్దం ఆ గదిలో..

'డాక్టర్ సుజిత్ '? అంటే కేన్సర్ స్పెషలిస్టా సుజిత్ గారా?" అంది రాధిక కంగారుగా.

నెమ్మదిగా తల ఊపారాయన.

"ఎందుకు? ఏమయింది స్వప్నికి?"  అడిగింది రాధిక

"అబ్బే, అలా ఏమీ ఉండదమ్మా. అసలు కారణం తెలుసుకోవాలి కదా. అందుకని మరి కొంత టెస్ట్ చేయిస్తే మనకి మరింత క్లారిటీ వస్తుంది. అందుకనే" అన్నాడు ఆయన.

రాధిక ముఖం మ్లానమైంది.ఏమీ మాట్లాడలేదు ఆమె.

" బ్లడ్ టెస్ట్ కాక మరే టెస్ట్ చేయించాలంటారు?" అన్నాడు కిరణ్

"అసలు విషయం తెలియాలంటే".. ఒక్క క్షణం ఆగి

" 'బోన్ మేరో టెస్ట్' చేయించడం చాలా అవసరం.

అందుకని బోన్ మేరో టెస్ట్ చేయిద్దాం" అన్నాడు నెమ్మదిగా.

ఆయన గొంతు ఆయనకే బలహీనంగా వినిపించింది.

టెస్ట్ పేరు వినగానే, ఈ సారి కిరణ్ కూడా అదిరిపడ్డాడు.

ఆ మాట వింటూనే రాధిక కి స్పృహతప్పినట్టయింది, కళ్ళు బైర్లు కమ్మినట్టయి సోలిపోయి కిరణ్ భుజం మీద వాలిపోయింది. గత కొన్ని రోజులుగా నిద్ర సరిగా లేకపోవడం, పిల్ల ఆరోగ్యం పట్ల ఆదుర్దా, అలసట ఇవన్నీ రెండితంలయి ఆమె మనసు తట్టుకోలేకపోయింది.

" రాధీ, రాధికా!" అంటూ భుజం, ముఖం తట్టి లేపడానికి ప్రయత్నించాడు కిరణ్.

"కొద్దిగా షాక్ తగిలి ఉండవచ్చు, మొదటినించీ సున్నితమైన మనసున్నదే కదా. ఇదిగో నీళ్ళు ఇవ్వండి". భర్త ఫోన్ కాల్ తర్వాత వీలైనంత త్వరగా బయల్దేరి వచ్చిన డా. స్నేహ అనునయంగా అంది.

కొద్దిగా నీరు ముఖాన చిలకరించాకా, తేరుకున్న రాధిక కొద్దిగా నీరు తాగి తేరుకుంది.

" బోన్ మేరో టెస్ట్ ఏవిటి డాక్టర్? ఎందుకు? అది కేన్సర్ పేషెంట్ల కేకదా చేస్తారు? అంటే మీరు చెప్పేది?" ఆవేసం, ఆత్రుతా కలగలిపిన స్వరం తో అంది ఆమె.

“కొద్దిగా స్థిమిత పడు రాధికా, నేను చెప్పిన మాట నెమ్మదిగా అర్థం చేసుకుంటూ విను.

పాప బ్లడ్ రిపోర్ట్ చూశాకా, కొన్ని విషయాలు తెలుసుకోవడం ఎంత అవసరమో, కొన్ని లేవని నిర్ధారణ చేసుకోవడం కూడా అంతే అవసరం. అంటే రూలింగ్ అవుట్ అన్నమాట.”

అందుకే ఈ నిర్ణయం రాజేష్, సుజిత్ కలిసి తీసుకున్నారు. అంది ఆమె

" కావచ్చు డాక్టర్, కానీ ఈ టెస్ట్ ఎందుకు? మరేం మార్గం ఉండదా? కావాలంటే ఇంకొక బ్లడ్ టెస్ట్" తను అంటున్న మాటల్లో అర్థం లేదని ఆమెకీ తెలిసింది. అందుకని మరింకేమీ అనలేక నిశ్శబ్దంగా ఉండిపోయింది. అప్రయత్నంగానే దొర్లిన కన్నీటిబొట్లు ఆమె  చెక్కిళ్ళని తడుముతూ తడిపోస్తున్నాయి.

" రాధీ ప్లీజ్, కంట్రోల్ యువర్సెల్ఫ్. ఇంకా ఏమీ తెలియకుండానే ఇంత కంగారు పడచ్చా? తప్పు. లే. కంపోజ్ యువర్సెల్ఫ్." అంది డా. స్నేహ

" ఎలా? లేదని తేలుచుకోవాలి అని చెప్తున్నారు. అది కూడా కేన్సర్ స్పెషలిస్ట్ సుజిత్. అంటే స్వప్ని కి.." అంటున్న రాధిక భుజం మీద చెయ్యి వేసి చెప్పింది స్నేహ.

" పరీక్షలో ఫలితం తేలేవరకూ మనం దేన్నీ ఖచ్చితంగా అనుకోవలసిన అవసరం లేదు. పరీక్ష చేయించవలసిన అవసరం వచ్చినంత మాత్రాన జబ్బు ఉన్నట్టూ కాదు. కనక మనం పరీక్ష చేయించి, ఫలితం వచ్చేవరకూ వేచి చూద్దాం" అంది స్నేహ.

" స్నేహా, మొదట డాక్టర్ గానే పరిచయం అయ్యారు మీరు. కానీ ఇప్పుడు నాకొక మంచి స్నేహితురాలు, మీ అంత గొప్ప వారు నాకు స్నేహితురాలు కావడం నా అదృష్టం అనుకుంటాను నేను. మీరన్నా, మీ మాటన్నా నాకెంతో నమ్మకం. అందుకని దయచేసి అసలు విషయమేమిటో దాచకుండా చెప్పండి ప్లీజ్" అంది రాధిక వణుకుతున్న కంఠం తో.

" నన్ను నమ్ము రాధీ, ఏమీ లేదని తెలుసుకోవడానికే ఈ టెస్ట్. నేను చెప్పేది నిజం. రాజేష్ సంగతి మీకు తెలీదూ, పేసెంట్ కి ఇంజెక్షన్ ఇవ్వడానికే పది నిమిషాలు ఆలోచిస్తారు. అవసరం లేకపోతే ఇలాంటి టెస్ట్ చేయించమని అడగరు కదా" అంది ఆమె.

ధారగా జారుతున్న కన్నీళ్ళ మధ్యలోనే అవునన్నట్టు తల ఊపింది రాధిక.

“అయ్యో, మీరు ఇంతగా చెప్పాలా డాక్టర్? . రాజేష్ గారి గురించి మాకు తెలియదా? ఏదో తల్లి మనసుతో ఆత్రుత పడుతోంది కానీ మీ ఇద్దరి గురించీ రాధిక కి మాత్రం కొత్తగా చెప్పాలా?” అన్నాడు కిరణ్ రాధికని అలా మాట్లాడవద్దన్నట్టుగా వారిస్తూ.

" తప్పు కదా రాధీ, అలా అనచ్చా! మనకోసమే చెప్తున్నారు కదా. అయినా మన స్వప్ని కి ఏమీ కాదు. ఇది నా మనసు గట్టిగా చెప్తున్న మాట. అందుకని నువ్వు మరేమీ ఆలోచించి అందరినీ కంగారు పెట్టకు" అన్నాడు భార్య భుజం మీద చేయి వేసి కన్నీరు తుడుస్తూ.

అతని ఆశ నిజమయితే ఎంతో బావుండేది..మనకి కావలసినది జరగాలని కోరుకోవడమే తప్ప, మనుషులు చేసేది మాత్రం ఏముంది?

తర్వాతి వారం పది రోజులు కిరణ్, రాధిక లో ఇంట్లో ఏ పనీ సజావుగా జరగలేదు. సూదిమందుకే భయపడే స్వప్నికని బోన్ మేరో టెస్ట్ కి ఒప్పించడం అంత సులభంగా జరగలేదు.

ఆల్చిప్పల్లంటి పెద్ద కళ్ళనిండా నీళ్ళతో " బోన్ మేరో టెస్టా, నాన్నా? ఎందుకు? నాకెందుకు?" అని అడిగిన రోజు అతని తండ్రి మనసు కదిలిపోయింది.

ఎదుగుతున్న పిల్ల, పూర్తిగా కాకపోయినా ఈ పరీక్షలు, సైన్స్ పట్ల తగుమాత్రపు అవగాహన ఉన్న పిల్ల. ఏం చెప్పి ఒప్పించాలో తెలియలేదు వాళ్ళిద్దరికీ.

ముఖ్యంగా కిషన్ కి.

ఇంజెక్షనే తట్టుకోలేని కూతురికి తుంటి ఎముకకి పెద్ద సిరింజ్ ని గుచ్చి బోన్ మేరోని తీసి పరీక్ష చేస్తారని ఎలా చెప్పాలో అతనికి తెలియలేదు.

అసలంత నొప్పిని కూతురు ఎలా తట్టుకుంటుందో? అని అతని మనసంతా చెప్పలేని దిగులు కమ్ముకుంది.

చిత్రంగా రాధిక నింపాదిగా ఉంది ఆ నాలుగురోజులూ.

చిన్న ఇంజక్షన్ ఇచ్చి, స్వప్ని ఎముకలు తగినంత బలంగా ఉన్నాయో లేదో చెక్ చేస్తారని, అంతకంటే ఏమీ ఉండదని చెప్పింది రాధిక.

అపనమ్మకంతో తల్లివైపు చూస్తున్న స్వప్నిక జుట్టు సవరిస్తూ,

"ఈ మధ్య జ్వరం తరచుగా వచ్చి, బాగా నీరస పడింది కనక, ఒక సారి చెక్ చేసి బలానికి మందులు, సరైన ఆహారం తీసుకుంటే నేషనల్స్ కి బాగా ప్రిపేర్ అవచ్చని డాక్టర్ అంకుల్ మరీ, మరీ చెప్పారని" చెప్పింది రాధిక.

నేషనల్స్ అన్నమాట వినగానే కళ్ళల్లోకి గుప్పున వచ్చింది వెలుగు.

" నిజమా అమ్మా?" అంది చిరునవ్వుతో.

పరుగుపందెమంటే అన్నీ మర్చిపోతుందని తెలిసిన రాధిక

" డాక్టర్ రాజేష్ అంకుల్ గురించి మనకు తెలియదూ? నువ్వంటే ఎంత ఇష్టమో వాళ్ళిద్దరికీ. ఈ సారి ఎలాగైనా నువ్వు నేషనల్ ఛాంపియన్ వి కావాలని, ఆ తర్వాత ఇంటర్నేషనల్ కాంపిటీషన్ ల లో మన దేశపు జండా ని భుజం మీద కప్పుకుని విజేతగా నిలవాలని ఆయన కోరిక" అంటూ చెప్పిన రాధిక ని ఆశ్చర్యంగా చూశాడు కిరణ్.

కిరణ్ కళ్ళు భార్య తడి కళ్ళని తేలిగ్గానే పట్టాయి. మనసంతా మేఘంలా దిగులు కమ్ముకుని ఉన్నా భార్యాభర్తలిద్దరూ పెదవంచున అతికుంచుకున్న చిరునవ్వు తో మసిలారు.

టెస్ట్ చెయ్యడానికి నిర్ణయించిన రోజు ఉదయాన్నే లేచి తల స్నానం చేసి రోజూలాగే దేవుడికి పూజ చెసుకుంది రాధిక. పూజ కుంకుమ తన నుదిటిన పెట్టుకుని, కూతురికి పెట్టింది.

సాహిల్ ని స్కూల్ కి పంపించి ముగ్గురూ కార్ లో బయలుదేరారు.

డయాగ్నోస్టిక్ సెంటర్ కి చేరగానే కాళ్ళు వణికాయి రాధికకి.

చేతిలో టెస్ట్ చెయ్యమని రాసి ఉన్న డాక్టర్ రిపోర్ట్. దానిమీద రాసి ఉన్న STAT అన్న నాలుగు అక్షరాలు వాళ్ళిద్దరూ గమనించలేదు.

వైద్య పరిభాషలో 'అర్జంట్' లేదా 'తక్షణం' అన్న అర్థం స్ఫురించే ఆ నాలుగక్షరాల పదం వారికి తెలియదు.

కూతురికి ఏమవుతుందో కూడా తెలియదు.

ఏదీ జరగకూడదన్న ఆశ తప్ప మరే భావమూ లేదు వాళ్ళ మనసులో.

ముగ్గురూ ముందుకు నడిచారు.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments